# A పెద్దలకు మాత్రమే

## సెంటర్ సెన్సేషన్

ఇప్పుడు మీరు ఆంధ్రభూమి సెంటర్ సెన్సేషన్ మొదటి పేజీ చదువుతున్నారు

చిన్నవాళ్లు చదవ కూడదని మీకు అనిపిస్తే ఇక్కడే చదివేసి ఈ నాలుగు పేజీలు మాగ్‌జైన్ నుంచి వేరు చేసి భద్రంగా వుంచుకోండి. పాఠకుల కోరికపై వారానికో సెంటర్ సెన్సేషన్ అందించాలని నిర్ణయించుకున్నాము. పాఠకుల అభిరుచులకు అనుగుణంగా పెద్దలకు మాత్రమే ప్రత్యేకంగా రాయించి ప్రచురించే కథలు ఇవి.

# బహిరంగ రహస్యం

## విదేమారటింగ

సకుటుంబంగా చదువుకునే ఆంధ్రభూమిలో పర్సనల్‌గా చదువుకునే కథ 'సెంటర్ సెన్సేషన్'. ఈ కథ నాలుగు పేజీలు కలిపి లాగితే చక్కా వూడి వచ్చేస్తాయి. వాటిని సెంటర్ సెన్సేషన్ కలెక్షన్‌గా ఫైలు చేసుకోవచ్చు.

రమణీయంగా వుంటుంది కాబట్టే, రమణి! కోమలంగా వుంటుంది కాబట్టే, కోమలి! బలం లేనిది కాబట్టే అబల! ఆపైన ఫెయిర్ సెక్స్ అని వీకర్ సెక్స్!! వీకర్ సెక్స్ స్త్రీ కాదు – మగాడే! అప్సరసలా కనపడ్డ అమ్మాయి ఒక క్షణంలో నాగుపాములా కనబడితే పారిపోతాడు మగాడు. ఇంత చపల చిత్తుణ్ణి, మానసిక బలహీనుణ్ణి తయారుచేసిన భగవంతుడు, ఆ లోటును భర్తీ చేసేందుకేమో, శారీరక బలం ఇచ్చాడు. మగాడు 'వీకర్ సెక్స్' ఎలా అయ్యాడు? అన్న మనో విశ్లేషణే ఈ 'బహిరంగ రహస్యం' కథ వెనుక కథ.

**మొ**దటి రాత్రి!

పాత కాలపు పెళ్లికూతుళ్లల్లా నేనేం అమాయకురాల్నికాను. మరీ చిన్న వయసూ కాదు. పందొమ్మిది వెళ్లి, ఇరవైలో అడుగు పెడ్తున్నాను. స్కూల్లో చదువుతున్నప్పుడు, సుశీల నాకన్నీ చెప్పింది. చిత్రమేమిటంటే దాని పెళ్లీ ఈ వారంలోనే! మా అత్తగారింటికి రెండు కిలోమీటర్లలో ఉంది సుశీల అత్తగారిల్లు. మా వూరే! ఎవరొచ్చినా రాకపోయినా 'మొదటి రాత్రి'కి సుశీల రావాలి. సాయంత్రం వరకు చూశాను. ఎందుకోరాలేదు. బహుశా పెళ్లిపనుల్లో చాలా 'బిజీగా' వుందేమో!

'సూపర్ బంపర్' ప్రైజ్‌తో పాటు కన్సొలేషన్ ప్రైజ్ కూడా వచ్చినట్టు, నా మొదటి రాత్రి అనుభవం, మరో మరుపురాని, మరువలేని అద్భుతం.

మల్లెల పందిరి, మొగలిపూల జడ, ముదురు నీలంరంగు జరీ పట్టుచీరె, మెత్తటి దీపాలు, వెండి పళ్లెం నిండా నోరూరించే వంటకాలు, స్టీరియోలో కమ్మని పాటలు – అదో తియ్యని కల.

పది దాటిన తర్వాత నవ్వులు, వేళాకోళాలు, గిలిగింతలు పలచబడ్డాయి. వేణూని, నన్నూ వదిలేసి వెళ్ళిపోయారు.

చల్లని ఆ రాత్రి వేణు అడిగాడు.

"ఏయ్! నీకేం కావాలో కోరుకో..."

ఏం కావాలి?

పరవళ్లు తొక్కుతున్న నదికి దాహం వేస్తుందా? విరగకాసిన పళ్ల చెట్టుకు ఆ పండు తినాలని కోరిక వుంటుందా?

"సరే! నాదో కోరిక..." వేణు అని నా ముఖంలోకి చూశాడు.

"నా స్నేహితులందరికీ పెళ్ళైన సంవత్సరం లోపలే పండంటి బిడ్డలు పుట్టారు... ఒక్కడికి తప్ప. రామదొర అనీ. వాడికి పెళ్ళై నాలుగేళ్లయింది. పిల్లలు లేరు. రోజూ వాడిని ఏడిపిస్తూ వుంటాం... ఎంత ఇన్సల్ట్! ఆ ఇన్సల్ట్ నుంచి కాపాడే బాధ్యత నీదే..." వేణు అన్నాడు.

వేణు చెప్పిన ప్రతీమాట మనసులో రికార్డు చేసుకుంటున్నాను.

సుశీల వస్తుంది... అడుగుతుంది.

దానికన్నీ వివరంగా చెప్పాలి.

ఆలోచిస్తూంటే సున్నితంగా భుజం మీద చెయ్యిపడింది.

చెట్టు మొట్టమొదటి మొగ్గ తొడిగినపుడు, కోయిల మొదటిసారి గళమెత్తి పాడినపుడు, సముద్రంలో మొట్టమొదటి స్వాతిముత్యం ఆబగా నోరు తెరుచుకుని, వాన చుక్కకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నప్పుడు కనబడే ఆనందం, పులకింత, ఆదుర్దా, ఆతృత నాలో ఒక్కసారి పెటెల్లున పెల్లుబికాయి.

"ఎండు ద్రాక్షపళ్లను, తేనెలో నానపెట్టి, ఆపైన అమృత ధారలో ముంచి, దానికి లేత గులాబీ రంగు కొంచెంగా పులిమి... అది ఎదురుగా వుంచితే ఏం చేస్తావ్..." అని వేణు అడిగాడు.

వేణు చెప్పేదేమిటో అర్థం చేసుకునేలోగా కాలుతున్న ఇనుప ముక్కలు పెదాలకు తాకించినట్టుగా అనిపించింది. వేణు... చటుక్కున... వేగంగా... హాయిగా... స్తబ్దంగా వున్న నరాలను బిగించి లాగి వదలినట్టు... మొదటి ముద్దు ప్రసాదించాడు.

......

.....

....

## సెంటర్ సెన్సేషన్

ఇప్పుడు మీరు ఆంధ్రభూమి సెంటర్ సెన్సేషన్ కథ రెండవ పేజీ చదువుతున్నారు



"ఎక్కడో కవిత్వం చదివాను. బహుశా భీమన్నగారనుకుంటాను. 'వెన్నముద్దల పైన నల్ల ద్రాక్ష నదిమినట్టు' అన్న భావంతో వుందా కవిత...

సిగ్గుతో చేతులు గుండెల కదుముకున్నాను. తర్వాత జరిగింది సుశీలకు చెప్పలేను. ఎవరికీ కూడా...

కళ్లు తెరిచేసరికి తెల్లారిపోయింది. పరుగున బయటకు వెళ్లాను.

ఎదురుగా ముసిముసి నవ్వులతో సుశీల.

"సారినోయ్! నిన్న రాలేకపోయాను. పెళ్లిపన్లు... పెళ్లివాళ్లు. సతాయించేస్తున్నారు. ఇది కావాలి... అది కావాలి... అవి... రాత్రి భోజనాలయ్యే సరికి పదకొండు దాటిపోయింది...

ఆ... అసలు సంగతి... ఇవాళ ముహూర్తం... నువ్వూ, మీ వారూ రావాలి... పగలేలే!... అంత ఇబ్బంది లేదు" అంది చేత్తో మెల్లగా నన్ను పొడుస్తూ...

మూడు రోజుల పండుగ పూర్తయిన తర్వాత వేణూ, నేనూ మా ఇంటికి బయలుదేరాం...

ఇంట్లో అడుగుపెడుతూనే నాకు నచ్చని ఒకే ఒక విషయాన్ని చూశాను. అది ఆ ఇల్లు... రైలు డబ్బాల్లా పొడుగ్గా వుంది. ముందు ఓ హాలు కం గది. తర్వాత పడకగది. మూడోది వంటిల్లు. చివర పెరట్లో బావి. నాకు అస్సలు నచ్చనిది తడికల బాత్రూం... ఎంత అధ్వాన్నంగా వుందో. ఈప్లాను చూస్తే తెలిసిపోతుంది.

పైగా సందులో మా ఇంటి మురికినీరంతా పోతూంది.

ఇంకో విషయం!

ఆ ఇంట్లో వేణుకాక మరో నలుగురు మొగాళ్లున్నారు. అందరికన్నా చిన్నవాడు శరత్...

పద్దెనిమిదేళ్లుంటాయి... మూతి మీద నల్లటి గుర్తు లేర్పడుతున్నాయి మీసాల శైశవ దశ సూచిస్తూ.

శరత్ పైవాడు బాలక్రిష్ణ.

ఇరవై ఒక్కటి వయస్సు...

ఇనుపముక్కలా గట్టిగా వున్నట్టు కనబడతాడు.

ఆ పైవాడు బాలసుబ్రమణ్యం...

పుష్టిగా వుంటాడు. ఎప్పుడు చూసినా నవ్వినట్టే వుంటుంది ముఖం.

అందరికన్నా పెద్దవాడు. ఇరవై అయిదు దాటేవుంటుంది వయస్సు. చామనఛాయలో వుంటాడు. కొద్దిగా పళ్లు ఎత్తు. దొంగ చూపులు. ఎవరి కళ్లలోకి సూటిగా చూడలేడేమో ననిపిస్తుంది. ఏదో తెలియని తప్పుచేసిన వాడిలా వుంటాడు. పేరు ప్రసాద్. వీళ్లు వేణుకేమవుతారు?

ఆ విషయం పెళ్లిలోనే తెలిసింది. వరుసల విషయం అనవసరం... జరగబోయే కథలో ప్రధాన పాత్రధారులైన ఈ నలుగురికీ నాతోవున్న బంధుత్వం తెలియకపోతేనే మంచిది.

అక్కడికి వచ్చిన మొదటి రోజే ఇబ్బంది మొదలైంది.

రాత్రి ఆదమరచి నిద్రపోతున్నాను. ఎవరో వంటిమీద చళ్లున చరిచారు. ఉలిక్కిపడి లేచాను.

వేణు...

దెబ్బ తగిలిన చోట మంట మొదలైంది.

"ఎందుకు?" అన్నాను కోపంగా...

"ఒబ్బిడిగా పడుకోలేవా?"

"ఏం జరిగింది?"

"బాత్రూంకు వెళ్లాలంటే ఇదే దారి.

'బాల సుబ్బి'గాడు తలుపుకొట్టాడు. లైటేసి తలుపు తీశాను. మన మంచం ముందునుంచే కదా వెళ్లాలి? వెళ్లాడు వెధవ... చూస్తూ, నెమ్మదిగా వెళ్లాడు...

"అప్పుడు నువ్వెలా వున్నావో తెలుసా!"

తెలీదన్నట్టు తలూపాను.

నీకు దెబ్బ ఎక్కడ తగిలిందో చూసుకో.

ఎర్రగా కందిన ప్రదేశం చూసుకున్నాను.

సిగ్గుతో ముఖం కందిపోయింది నాకు.

కొన్ని క్షణాల తర్వాత అన్నాను.

"బాల సుబ్రహ్మణ్యం చాలా మంచివాడండీ. ఎప్పుడూ నవ్వుతూ కనిపిస్తాడు..."

పరధ్యానంగా అన్నాడు వేణు.

"వుండచ్చు...

** ** **

నాలుగు రోజుల తర్వాత సుశీల వ

# సెంటర్ సెన్సేషన్

ఇప్పుడు మీరు
ఆంధ్రభూమి
సెంటర్
సెన్సేషన్ కథ
మూడవ పేజీ
చదువుతున్నారు



చ్చింది. ఇంట్లో ఎవరూ లేరు సుశీలకూ, నాకు వున్న స్నేహం ప్రాణానికి దేహానికి వున్నటు వంటిది.

మా స్కూలు రోజులు తలుచుకుంటే బాగానే వుంటాయి కాని, మూడో మనిషికి చెప్పుకునేవి కావు. చిన్నప్పట్నించీ అడ్వెంచర్స్ అంటే ఇష్టం మా ఇద్దరికీ. సుశీల నా కన్నా కొంచెం పెద్దది.

ఎండకి మాడిపోయిన 'మధ్యాహ్నం వాడిపోయి చీకటి గుహలో విశ్రాంతికి నీరసంగా ప్రవేశించే ఓ రోజున!

గుడిలో ఆడుకుంటున్నాం, నేనూ, సుశీల, విశ్వం.

మా వయస్సు వాడే విశ్వం.

గుడిలో జనం లేరు. అసలా గుడికి సంవత్సరానికి ఒకసారయ్యే తిరణాలకు తప్ప మామూలుగా జనం రారు.

లోపల్నించి తలుపులు మూద్దామని పూజారి దూరం నుంచి వస్తున్నాడు.

సుశీల ఆయన్ను చూడ్డంతోనే చంగున ఎగిరి గుడికి ఓ పక్కగా వున్న రథం ఎక్కేసింది. నాకూ భయమే ఆ ముసలాయన అంటే!

ఆ వెనకాలే విశ్వం కూడా ఎక్కేసాడు. ముగ్గురం రథంలో కూర్చున్నాం. ఇరుగ్గా వుంది.

వేసవికాలం... ఉక్క! బరువుగా పరికిణీ!

ముగ్గురం అతుక్కుపోయి పూజారి ఎప్పుడెల్తాడా అని కుతూహలంగా చూస్తున్నాం.

సుశీల ఏంచేసిందో, విశ్వం ఉలిక్కిపడి, "ఛీ... ఏమిటిపాడు" అని అరవబోయి క్రింద పూజారి భయానికి గుసగుసగా అన్నాడు.

"హుష్! ఊరుకో! లేపోతే నువ్విక్కడున్నావని చెప్పేస్తా' అని బెదిరించింది.

అసలా బెదిరింపు అక్కర్లేదు.

మెత్తని సుశీల చేతులు విశ్వాన్ని ఎక్కడో పరామర్శిస్తున్నాయి.

కొంత సేపు వూరుకున్నా విశ్వం తనూ వూరుకోలేదు.

అలా ఆరోజు సుశీలా, విశ్వం, నేనూ మరో ప్రపంచాన్ని కనుక్కున్నాం.

మా వయస్సులో వున్నవాళ్లందరూ నర్మగర్భంగా మాటాడుకునేవి ఏమిటన్న ప్రశ్నేలేదు. అలాంటప్పుడు సుశీలలాటి సన్నిహితత్వం కలది అడగవలసినవి అడగబోయేది ఏముంటుంది... సుశీల అడిగింది నా మొదటి అనుభవం.

వేణులో నాకు నచ్చినవి చెప్పాను. తనకేం నచ్చాయో, తన భర్తలో చెప్పమని అడిగాను.

"ఓ! అదా! ఆయనో భోళా మనిషి..."

ఆయనకేం రహస్యాలు లేవు... అన్నీ చెప్పేశారు. నన్ను అడిగారు... నేను ఏదీ దాచలేదు. అన్నీ చెప్పేశాను..." అంది.

"శిలాక్షరాల"లాటి మాట గుర్తుపెట్టుకో. మగాడి ప్రేమ పొగ మంచులాంటిది... నిమిషాలలో ఎగిరిపోతుంది. రహస్యాలు వెల్లడించే ఆడదంతా మూర్ఖురాలు ఇంక వుండరు. అణుబాంబులు కూడా ఛేదించే వీలులేని రహస్యాలు మనవాళ్లలో వుంటాయి... సరే! ఇంకేమన్నారు మీ వేణు!... అడిగింది.

"సంవత్సరం తిరిగేలోపల పండంటి బిడ్డ కావాలిట... ఇన్సల్ట్ నుంచి కాపాడాలన్నారు..."

"మరి నువ్వేం చేస్తున్నావ్..."

"ఇప్పటినుంచి ఏమిటవి "పిల్స్" వాడుతున్నా..."

"అలాగే చెయ్యి... ఇంకోటి చెయ్యాలి..." అని నేనేం చెయ్యాలో సుశీల చెప్పింది.

"కాని ఎందుకు?" అడిగాను.

"మీ ఆయనకు నీ మీద వల్లమాలిన ప్రేమున్నావ్ కదూ!..."

"అవును..."

"అది దీంతో తేలిపోతుంది...'

"దీన్లో ఏముందని... ఇదేం రహస్యం 'కాదే!..."

"కరెక్టుగా చెప్పాలే! ఇది బహిరంగ రహస్యం..." అయితే ఇదో చిన్నపరీక్ష.

సుశీల వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిన తర్వాత ఆలోచనలో పడ్డాను.

మగాడి ప్రేమ పొగమంచా!

సుశీల నాకన్నా తెలివైంది.

ఆమె చెప్పిన ఆ 'బహిరంగ రహస్యం' పర్యవసానం ఎలా వుంటుంది?

ఓ నిర్ణయానికొచ్చాను.

దీంతో తేలిపోతుంది.

నిద్రపోనని హఠం చేస్తున్న లోకాన్ని బలవంతంగా నిద్రపుచ్చాలని వృధా ప్రయత్నం చేస్తున్న, రాత్రి విసుగెత్తి తనే నిద్రపోతున్న వేళ!

వేణుతో చెప్పాను ఆ 'బహిరంగ' రహస్యం'.

షాక్ తిన్నవాడిలా అయిపోయాడు వేణు. వివర్ణమైన అతని ముఖం చూస్తూ, మరేం చేస్తాడోనని చూస్తూ నిలబడ్డాను.

గిరున ముఖం తిప్పుకున్నాడు. ముఖంలో విపరీతమైన 'డిస్‌లైక్...' నేనంటే!

పది నిమిషాల తర్వాత భళ్లున తలుపులు తీసి బయటకు వెళ్ళిపోయాడు.

సుశీల ఊహించి చెప్పింది నిజమే!

అయితే మిగిలినవి కూడా జరుగుతాయా!

తెల్లవారిన తర్వాత తెలిసింది. వేణు కేంపుకు వెళ్లాడు. వారం వరకు రాడని.

బహిరంగ రహస్యం ఇంట్లో అందరికీ తెలిసింది.

వేణు వెళ్లిపోయిన రెండో రోజు రాత్రి తలుపు చప్పుడైంది.

శరత్...

"బాత్‌రూం కెళ్లాలి..." అన్నాడు నావంక పరీక్షగా చూస్తూ.

ఆవలిస్తూ, ప్రక్కకు జరిగి చోటిచ్చాను.

నాలుగైదు నిమిషాల తర్వాత తిరిగొచ్చాడు. మరో గంటకు తలుపు చప్పుడైంది.

మళ్లీ శరత్!

ఆ రాత్రి నాలుగుసార్లు వచ్చాడు.

ఆఖరిసారి శరత్ వెళ్లిపోతున్నప్పుడు తెలిసింది. శరత్‌కు నిజంగా అన్నిసార్లూ పెరట్లోకి వెళ్లలేదు. కళ్లతో, జుట్టు చెదరిన నా అందాన్ని తాగేశాడు. సుశీల చెప్పింది నిజమా!

మరో రోజు.

వేణు ఎక్కడికి వెళ్లిందీ ఉత్తరం కూడా రాయలేదు.

దేవకన్యలాటి అందమన్నాడు. జీవితాంతం వదలనన్నాడు.

బాత్‌రూంలో ఆలోచిస్తూ స్నానం చేస్తున్నాను.

నా బట్టలన్నీ తడిక పైనే వున్నాయి. అది గుర్తు!

ఎవరూ రారు...

కొంత స్నానమూ, ఆలోచనా అయిన తర్వాత ఉలిక్కి పడ్డాను.

తడిక అవతల మనిషి కదలిక.

ఎప్పట్నించి నన్ను తడిక సందుల్నించి గమనిస్తున్నారో!

గబగబా చీర చుట్టబెట్టుకుని బయటకు వచ్చాను.

గుమ్మంలో ఓ మనిషి నీడ మాయమైంది.

బాలసుబ్రహ్మణ్యం!

కోపంగా అనుకున్నాను 'బాల సుబ్బిగాడు...'

రెండు రోజులు భారంగా గడిచిపోయాయి. వేణు నుంచి ఏ సమాచారమూ లేదు.

పంచదార చిలకలాటి నేను చేదు గుళికలా ఒక్క మాటతో ఎలా మారిపోయాను?

మూడో రోజు అర్ధరాత్రి!

తలుపు చప్పుడైంది.

తెరిచాను...

నవ్వుతూ బాలక్రిష్ణ.

వీళ్ల 'ట్రిక్స్' నాకు తెలుసుకాబట్టి, నా మంచం చుట్టూ పాత చీరె, కర్టెన్‌లా కట్టాను.

తలుపు తెరుచుకుని బాలక్రిష్ణ వెళ్లాడు.

ఆవలిస్తూ గుమ్మానికానుకుని నిలబడ్డాను.

ఎంతకూ రాడు.

విసుగెత్తి మంచం మీద కూర్చున్నాను.

అయిదు నిమిషాలయింది... పది నిమిషాలయింది. పావుగంటయింది.

బాలక్రిష్ణ జాడలేదు.

ఇంతసేపేం చేస్తున్నాడు.

కుతూహలంగా చీరె తొలగించి చూశాను.

అదిరిపడ్డాను!

ఒక అడుగు దూరంలో, నా మంచం దగ్గరగా బాలక్రిష్ణ.

నన్ను చూసి బెదరలేదు. వెకిలిగా నవ్వుతూ నిలబడ్డాడు.

"వెళ్లిపో!" అన్నాను దృఢంగా...

తలవంచుకు వెళ్లిపోయాడు.

ఆరోజు నుంచి నిర్ణయించుకున్నాను. తలుపు తీయకూడదని.

బాత్రూం కెళ్లాలంటే ఇంకో మార్గం చూసుకోమని చెప్పాలి.

నీ కంటే నాకెవరూ లేరని, జీవితాంతం నువ్వే నా సర్వస్వం అన్న వేణు 'ఆ ఒక్క మాటతో' వెళ్లిపోయాడు. అదే ఆశ్చర్యం నాకు.

నావంక కన్నెత్తి చూడనిది ఇంతవరకు ప్రసాద్ ఒక్కడే.

పది దాటిన తర్వాత తలుపులు బిగించి వచ్చాను.

పగలంతా కట్టిన చీరె విప్పి అవతల పడేసి తేలిక చీరె కట్టుకుని పడుకుందామని ఆయత్తమవుతుండగా నా గదిలో మనిషి అలికిడైంది.

భయంతో నా గుండె వేగం పెరిగింది.

మంచం క్రిందనుంచి ఎలుగుబంటిలా వచ్చాడు ప్రసాద్.

నదురూ,! బెదురూ లేకుండా నా దగ్గర కొచ్చాడు.

'నీ రహస్యం నాకు తెలుసు నీ లోపం నాకు తెలుసు. ముష్టివాడికి లోపం వుంటే ఏడవడు. సంతోషిస్తాడు.. అవిటితనాన్ని అడ్డం పెట్టుకుని డబ్బు సంపాదిస్తాడు. నువ్వు నలుగురితో ఆనందం పంచుకో, మంచుబొమ్మలా నీలో ప్రతి అవయవం ఎలా మెరుస్తూందో చూడు. ఆ మంచు కరిగి నీ రూపం మాయమవక ముందే..."

ఊహ తెలియనప్పుడు చేసిన పని, అది తెలిసిన తర్వాత చెయ్యం. ఇప్పుడు వేణుకి తప్ప నా శరీరంపై మరొకరికి అధికారం లేదు.

మీదికి రాబోతున్న ప్రసాద్ ముఖం నా గోళ్లతో చీరాను.

'బహిరంగ రహస్యం'మనిషి మనసుని అద్దంలో పెట్టినట్టు చూపించింది.

ఆ మర్నాడే వేణు వచ్చాడు.

నిజం చెప్పాను. నేనంతకు ముందు చెప్పిన అబద్ధం గురించి. పాలిపోయిన వేణు ముఖం ఎర్ర గులాబీలా వికసించింది.

అడ్వెంచర్‌లో ఒక నగ్న సత్యాన్ని తెలుసుకున్నాను.

చంచల అన్న పేరు ఆడదానికుంది. అది ఆమెకు వర్తించదు.

ఆ పేరుకు తగ్గవాడు మగవాడే! చంచలమైన మనస్సు మగవాడి స్వంతం.

ఇంతకీ నే చెప్పిన మాట! వేణుకి రుచించనిది. నేను 'స్టెరైల్' అని నాకు పిల్లలు పుట్టరని.

వ్యవసాయదారుడు రాతిమీద గింజలు చల్లడానికి ఇష్టపడడు. అది సహజం.

మరి నేను... అర్ధాంగిని... ప్రాణం లేని రాయిలాంటిదాన్నా! వేణు తను విత్తనాలు చల్లేవాడినని, నేను చవిటి భూమినని ఎలా అనుకున్నాడు?

చంచలమైన మనస్సు ఎవరిది?

ఇదే బహిరంగ రహస్యం!

వచ్చేవారం

మరో సెంటర్ సెన్సేషన్ *

**సెంటర్ సెన్సేషన్**

ఇప్పుడు మీరు ఆంధ్రభూమి సెంటర్ సెన్సేషన్ కథ నాల్గవ పేజీ చదువుతున్నారు ఈ పేజీ అయిపోగానే మాగ్‌జైన్ నుంచి పేజీలు తొలగించి మీ సెంటర్ సెన్సేషన్ కలెక్షన్ ఫైలులో వేసుకోండి.